




పటిష్టంగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ పకడ్బంధీగా ఉండాలని ఎస్పీడిజిల్లా పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో కందుకూరు డివిజన్ పరిధిలోని ఏడు మండలాలలోని ప్రధానో పాధ్యాయులకు, ఎపి మోడల్ స్కూల్, కేజిబివిల ప్రిన్సిపాల్స్ కు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ఓరియంటేషన్ నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల ప్రాముఖ్యతను రవీంద్రనాథ్ రెడ్డి వివరిస్తూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహణఉండాలని సూచించారు. ఆర్‌జెడి లింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిం చాలన్నారు.జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. డిసిఈబి సెక్రటరీ రామ్ కుమార్, ఎఎంఒ సుదీర్ బాబు, కందుకూరు, ఆత్మకూరు ఉప విద్యాశాఖ అధికారులు నరసింహారావు, జానకిరామ్, ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో రైతు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు బోనస్‌గా రూ.500లు రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం ధాన్యానికి మద్దతు ధర సాధించుకునేందుకు రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు సంయుక్తంగా చలో నెల్లూరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఎబిఎం కాంపౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. తొలుత ఇందుకూరు పేట మండలానికి చెందిన రైతులు పాదయాత్రగా ఎబిఎం కాంపౌండ్‌కు చేరుకొని ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 7లక్షల ఎకరాలల్లో రైతులు వరిపంట సాగుబడి చేశారన్నారు. దాదాపుగా 20లక్షల పుట్ల ధాన్యం ఉత్పత్తి అయిందన్నారు. గతేడాది పుట్టి ధాన్యం రూ.26 వేల నుంచి రూ.25 వేలు వరకు మద్దతు ధరగా నిర్ణయించి ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఈ ఏడాది మాత్రం రూ.18 వేలకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వమే మద్దతు ధర తక్కువగా ప్రకటిస్తే, ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఇంకా ధర తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు.రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్నామంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఘంటా పథంగా చెబుతున్నారన్నారు. జిల్లాలో 350 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని, ఎక్కడైనా, ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలోనైనా రైతుల నుంచి కిలో ధాన్యం కొనుగోలు చేసిన ధాఖలాలు లేవన్నారు. రైతు పండించిన ధాన్యం విక్రయించేందుకు అవసరమైన గోతాలు, కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు లారీలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే రైతుల నుంచి ఒక క్వింటాల్ దాన్యానికి బోనస్‌గా రూ.500లు అందజేసి, సదరు పంటను కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం పూర్తిగా బాధ్యత తీసుకొని రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేసేందుకు నిబంధనలు సడించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి మాసూళ్ల సీజన్‌లో దళారులు, మిల్లర్లు ఏకమై, రైతులను పలు రకాలుగా ఇబ్బంది పెట్టి, మద్దతు ధర కంటే ధాన్యం కొనుగోలు చేయడం సరికాదన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ ' ఈ పంట' పోర్టల్‌లో నమోదు చేయని, ఈకెవైసి పూర్తి చేయని రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ప్రభుత్వం చేపట్టాలన్నారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను కలిసి రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు కలిసి సమస్యలను వివరించారు. నాయకులు చెప్పిన సమస్యలపట్ల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించి రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా రైతులు ధాన్యం విక్రయించే సమయంలో అవసరమైన మేరకు గోతాలు సరఫరాచేసేందుకు అధికారులు చర్యలు తీసుకొనే విధంగా సూచనలు చేస్తామన్నారు.కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, అధ్యక్షులు గురునాధం, ఎపిరైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు, వ్యకాస జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్, పొట్టేపాళెం చంద్రమౌళీ, గండవరపు శ్రీనివాసులు, గంటా లక్ష్మీపతి, పలువురు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


మంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు :రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాపితంగా జరిగే ఆందోళనలో భాగంగా శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఎస్ఎ గౌస్, జివిబి కుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాదాల రమణయ్య మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జస్టిస్ స్వామినాథ న్ కమిషన్ సిఫార్సులను పక్కనపెట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పెట్టుబడులు అధికమై గిట్టుబాటు ధర రాక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ శ్రీ పూజకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు గుడ్లూరు ,ఉలవపాడు మండల కార్యదర్శి, కొట్టే వెంకయ్య, ఎస్డి గౌస్ బాషా, రైతు సంఘం గుడ్లూరు మండల అధ్యక్ష కార్యదర్శులు, దామా కష్ణయ్య, వర్ధినేని సిద్దయ్య, సిఐటియు నాయకులు దాసరి రామమూర్తి, డి ఎం రాయుడు, చిమటా శ్రీనివాసులు, ఉప్పు వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకులు ఎస్.కె మల్లిక, ఎం పద్మావతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పొట్లూరు రవి, మెడ బలిమి ప్రసాద్, కెవిపిఎస్ జిల్లా నాయకులు మాధవ మూర్తి, నేలటూరి తిరుపాల్ పాల్గొన్నారు.



కందుకూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

నేడు సిఎం చంద్రబాబు రాక..!

బీద కుమారుని వివాహానికి హాజరు - గంట పర్యటన, భారీ బందోబస్తు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు జిల్లాకు రానున్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుని వివాహనికి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 12.10 నుంచి 1.10 గంటల వరకు నగరంలోని ఆయన పర్యటనకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు ఉదయం 9.30 గంటలకు ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి విజయవాడ నుంచి విమానంలో తిరుపతి చేరుకుంటారు. తిరుపతిలో జరిగే కార్యక్రమానికి హాజరై అనంతరం నెల్లూరు బయల్దేరుతారు. 11.45 నిముషాలకు హెలి కాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు కనుపర్తిపాడులోని జెడ్‌పి పాఠశాలలో దిగుతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో విపిఆర్ కన్వెక్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. 12.25 నుంచి 12.55 గంటల వరకు వివాహ వేడుకల్లో ఉంటారు.అక్కడ నుంచి 1.10 హెలికాప్టర్‌లో బయల్దేరి వెళతారు. గంట మాత్రమే ఒక సెంటర్‌లో సిఎం హాజరు కానున్నారు. సుమారు 900 మంది సివిల్, ఎఆర్ కానిస్టేబుళ్లు, డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐలు భారీ స్థాయిలో హాజరుకానున్నారు. కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్‌పి కృష్ణకాంత్ సిఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. గొలగమూడి రోడ్డు, విపిఆర్ కన్వెక్షన్ సెంటర్‌ను పోలీసులు కంట్రోల్ తీసుకున్నారు.


విపిఆర్ కన్వెక్షన్ వద్ద పోలీసుల బందోబస్తు దృశ్యం

డాక్టర్ బిందుమీనన్‌కు అవార్డు

నెల్లూరు :ప్రముఖ న్యూరాలజీ వైద్యురాలు, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగ అధిపతి డాక్టర్ బింధు మీనన్ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన 15వ ఆసియా ఓషియానియన్ ఎపిలెప్సీ సదస్సులో ఆ సంస్థ చైర్మెన్ జాన్ డబ్ల్యు దునే చేతుల మీదుగా ఆసియా ఓషియానియన్ అవుట్ స్టాండింగ్ అచీవ్ మెంట్ ఎపిలెప్సీ అవార్డును డాక్టర్ బింధు మీనన్ అందుకున్నారు. మూర్ఛ రోగం నివారణకు గాను ఆమె చేస్తున్న విశేష సేవలను గుర్తించిన ఎఒఈసి సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. మూర్ఛ వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం, ఉచితంగా వైద్య సేవలు అందించడం, మూర్ఛ వ్యాధి నివారణకు పరిశోధనలు చేయడం తదితర అంశాల్లో డాక్టర్ బింధు మీనన్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఎఒఈసి చైర్మెన్ జాన్ డబ్ల్యు దునే కొనియాడారు.అనంతరం పలువురు మాట్లా డుతూ ఇండియన్ ఎపిలెప్సీ (మూర్ఛ వ్యాధి) అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొన సాగుతున్న డాక్టర్ బింధు మీనన్ మూర్ఛ వ్యాధుగ్రస్తులను సంరక్షించడంలో ముందుం టున్నారన్నారు.



నేడు గ్రూపు-2 పరీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నేడు నిర్వహించనున్న ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూపు -2 మెయిన్స్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 3.నుంచి 5.30 గంటల వరకు పేపర్-11 పరీక్షలు నిర్వహిం చనున్నారు. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిసోడియాకు వినతి

ప్రజాశక్తి-కందుకూరు : హేతువాదసంఘం సభ్యులు ఒంగోలు ప్రకాశం భవనం లో ప్రిన్సిపల్ సెక్రటరి సిసోడియాని శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. 2021 లో ప్రిన్సిపల్ సెక్రటరి ఉషారాణి ఇచ్చిన అదేశాలు అమలుపరచకుండా, కొట్లాది రూపాయలు విలువచెసేగుడ్లూరు మండలములో ప్రభుత్వభూమిని రామ దూతకు కట్టబెట్టాలనిచూస్తున్న అధికారులపైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. నార్నె వెంకటసుబ్బయ్య, భారత హేతువాదసంఘ అధ్యక్షులు నార్నె రోశయ్య, హేతువాదసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కష్ణప్రియ ఉన్నారు.

అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-కందుకూరు : ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు కార్యాలయం శనివారం అర్జీదారులతో కిటకిటలాడుతూ కనిపించింది. పలు సమస్యలపై విజ్ఞాపన పత్రాలను ఎంఎల్ఎకు అందజేయడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో వద్దకు వచ్చారు. సమస్యలను సావధానంగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు వింటూ పరిష్కారానికి అక్కడికక్కడే చర్చలు తీసుకోవడానికి ప్రయత్నం చేశారు.

ఎంఎల్ఎను కలిసిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-కందుకూరు :ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావును నూతనంగా ఉద్యోగ బాద్యతలు తీసుకున్న డిప్యూటీ డిఇఒ నరసింహా రావు శనివారం మర్యదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మాజీ డిప్యూటి డిఇఒ జానకి రామ్,ఎంఇవోలు .అజయ్ బాబు,కె సుబ్బారెడ్డి, కందుకూర్ బాయ్స్ హైస్కూల్ స్టాఫ్ సెక్రటరీ తల్లపనేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.





పుస్తక పఠనంతో జ్ఞానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాఖ గ్రంధాలయంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి. పేరయ్య బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 మంది కి గ్రంథాలయ సభ్యత్వం ఇప్పించి వారి లక్ష్యాన్ని తెలిపారు. ప్రతి విద్యార్థి స్కూల్ పాఠాలతోపాటు గ్రంథాలయ పుస్తక పఠనం చేయడం మీ మేధస్సుకు జ్ఞానం, కథలు, సైన్స్, జియోగ్రఫీ సంబంధించిన పుస్తకాలే కాక దేశ నాయకుల చరిత్రలు వాటిని చదివి విద్యార్థుల జ్ఞానం మెరుగు పరుచుకోవాలన్నారు. మంచి ఆదర్శ వంతమైన ఉద్యోగులుగా మంచి పౌరులుగా తీర్చి దిద్దబడాలని ఆయన యొక్క అమూల్యమైన సందేశాన్ని తెలియచేశారు.బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యయులు జి. నరసింహమూర్తి, తదితర ఉపాధ్యయులు ఈ కార్యక్రమనికి ఎంతగానో సహకరించారు. కందుకూరు గ్రంధ పాలకురాలు పి. నాగరజని ఉన్నారు.

ఉత్తమ ర్యాంకు కోసం కృషి

నెల్లూరు :దేశవ్యాప్తంగా ఉన్నత మున్సిపాలిటీల ఎంపికలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కమిషనర్ సూర్య తేజ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణ కోసం నగరంలో ఓట్ ఫర్ వెబ్, ఓట్ ఫర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రచారం చేయాలని కమిషనర్ తెలియజేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 ప్రారం భానికి అనుగుణంగా, నగరం యొక్క ర్యాంకింగ్‌ను మెరుగు పరచడానికి అవసరమైన లక్ష్యాలను సాధించడంలో నియమించబడిన అధికా రులందరూ సమన్వయంతో సహకరించాలని సూచించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-నెల్లూరు

రైతు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మంత్రి నాదెండ్ల మనోహర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ లతో ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా అధికారులు, రైస్ మిలర్స్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ రాబోయే రెండు నెలలు కష్టపడి పనిచేసి రైతాంగానికి మేలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కే వై సి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు నమ్మకం కలిగించే విధంగా 24 గంటల్లోగా చెల్లింపులు పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఇందుకు గాను జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేస్తామని రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి సూచనల మేరకు బ్యాంకు గ్యారెంటీలు అందజేసి, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో రైతాంగానికి మేలు చేకూరే విధంగా చర్యలు చేపడతామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల సహకారం గురించి, వారి సమస్యల గురించి విచారించారు. రైస్ మిల్లర్లతో ప్రత్యేకంగా సమావేశమై, బ్యాంక్ గ్యారంటీ రికన్సిలేషన్ లాంటి పనులను పూర్తి చేసి ఈ నెలాఖరు లోపు వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు..మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటనల ద్వారానే మెరుగైన ఫలితాలు సాధనకు ఆస్కారం ఉంటుందన్నారు. రైతాంగ ప్రయోజనాలే అందరి లక్ష్యంగా అధికారులందరూ పనిచేయాలన్నారు. పౌర సరఫరాల డైరెక్టర్ పట్టాభి రామి రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ రంగయ్య నాయుడు, సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కేశవ చౌదరి, పౌరసరఫరాల శాఖ డిఎం అర్జున్, డీఎస్ఓ అంకయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సత్య వాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

వామపక్షాలు నిరసన

ప్రజాశక్తి-కందుకూరు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జరిగిన అన్యాయంపై వామపక్షాలు మండిపడ్డాయి. కందుకూరు పోస్ట్ ఆఫీస్ సెంటర్లో వామపక్షాల పార్టీలు అయిన సిపిఎం, సిపిఐ,సిపిఎంఎల్ డెమోక్రసీ ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మన పక్క రాష్ట్రమైన తమిళనాడుకు చెందిన వారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కోడలని అయినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చే బడ్జెట్లో దారుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. పెరుగుతున్న ధరల ప్రకారం ఆదాయం తక్కువ ఇస్తూ పలు రకాల పన్నులతో జనాలను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పట్టిపీడిస్తున్నాయని వారు మండిపడ్డారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మధ్యతరగ చట్టబద్ధమైన హామీ కల్పించి వ్యవసాయ మార్కెట్ జాతీయ విధానము ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపుల 50శాతం పెంచాలని, పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలని, వద్ధాప్యంలో ఇతర సామాజిక భద్రత ప్రయోజనాల కోసం కేంద్రం కేటాయింపులు పెంచాలని వారు తదితర అంశాలపై డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్ ,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మాలకొండయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి. సురేష్ బాబు, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కే.మురళి, వై.ఆనందమోహన్, సి ఐ టి యు నాయకురాలు ఎస్కె సల్మా, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్కె హుస్సేన్, సిపిఐ నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మచారి, నీలిశెట్టి నరసయ్య, కోటేశ్వరరావు, ద్రోణాదుల ఆదినారాయణ, ఉప్పుటూరి మాధవరావు, సిపిఎం నాయకులు ఎస్కె మున్వర్ సుల్తానా, రాయుడు, ఎస్కె మల్లికా,ఎం పద్మా, సిపిఎంఎల్ డెమోక్రసీ నాయకులు ఆర్ మోహన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు


గుడ్లూరులో..

ప్రజాశక్తి -గుడ్లూరు : జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకి గత నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలకుడు ఎఎంఒ సుధీర్ బాబు శనివారం సందర్శించి పరిశీలించారు. ప్రత్యేక అధికారులు శిక్షణ తరగతుల్లో చెబుతున్న అంశాలను శ్రద్ధగా విని అర్థం చేసుకోవడంలో గుడ్లూరు మండలం అంగన్‌వాడీ కార్యకర్తలు చురుగ్గా ఉన్నారని కితాబిచ్చారు. క్లాసు బోధకులుగా టీ చంద్రశేఖర్ వరముని కుమార్, ఎ విజయ్ కుమార్ ఎంఇఒ గోవర్ధన్ పాఠశాల హెచ్‌ఎం రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు

పిల్లల్లో బోధన సామర్థ్యాన్ని పెంచాలని డిఇఒ ఆర్ బాలాజీరావు ఉపాధ్యాయులకి సూచించారు. కందుకూరు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ శిబిరాలను జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ బాలాజీరావు, జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో జి సుధీర్ బాబు శనివారం సందర్శించారు. ఈ శిక్షణలో కార్యకర్తల తయారుచేసిన అభ్యసన సామాగ్రి మేళాను ప్రత్యేకంగా వారు తిలకించారు. శిక్షణ ఏర్పాటు పట్ల వారు సంతప్తి వ్యక్తం చేశారు. ఎంఇఒలు కె సుబ్బారెడ్డి, బి అజయ్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు షకీల, లక్ష్మీ, ప్రభావతి, రిసోర్స్ పర్సన్సు పాల్గొన్నారు.


కందుకూరులో..


సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న అభాగ్యుల జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి వెలుగులు నింపుతున్నదని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో శనివారం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు..ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, సిఎం నారా చంద్రబాబు నాయుడు అడిగిన వెంటనే అపన్న హస్తం అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆర్థిక స్తోమత లేని అనేక మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మొత్తం 13 మంది కలిపి 899564 రూపాయలను లబ్ధిదారులకు అందజేశారు.లబ్ధిదారులు మాట్లాడుతూ తమ అనారోగ్యానికి సంబంధించి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. కందుకూరు పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, నాదెళ్ల వెంకట రమణయ్య, మచ్చు శ్రీను పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్ల నుంచి బి.సి, కాపు, ఈబిసి కార్పొరేషన్‌ల సబ్సిడీ లోన్ల కోసం దరఖాస్తు చేసుకొన్న దరఖాస్తుదారులకు నగరపాలక సంస్థ కమిషనరు వారి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణము నందు తేది. 24.02.2025 సోమవారం ఇంటర్వ్యూలు జరుగుతాని అదనపు కమిషనర్ వై.వో. నందన్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-కందుకూరు

వ్యవసాయ మార్కెటింగ్ కార్యలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న చదలవాడ జేమ్స్ (57) శుక్రవారం రాత్రి గుడ్లూరు నుంచి కందు కూరుకు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించే సమయంలో గుండె పోటు రావ డంతో మృతిచెందాడు. గుండెపోటు వచ్చిన జేమ్స్‌కి కందుకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుపోవడంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.



పలుచోట్ల 'పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : మండలంలోని చేవూరు రైతు సేవా కేంద్రం పరిధిలోని గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఈ కారక్రమాలు దోహద పడతాయన్నారు. టెక్నికల్ అడ్వయిజర్, మండల మండల వ్యవసాయ అధికారి వలేటివారిపాలెం హేమంత్ భారత్ కుమార్, ప్రభు ఉన్నారు.

పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

ప్రజాశక్తి-బిట్రగుంట



మాట్లాడుతున్న తుమ్మల వెంకయ్య

పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం విడనాలని బోగోలు సిపిఎం శాఖ సీనియర్ నాయకుడు తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. బోగోలు మండలం సిపిఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోగోలు పంచాయతీలోని కొండల్ సింగ్ వీధి, చెంచు లక్ష్మీపురం మెయిన్ రోడ్డు గుడి పక్కన విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట సెంటర్ మసీదు పక్కన రోడ్డుపైన చెత్త ఇష్టానుసారంగా వేసిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. బోగోలు పంచాయతీలో పారిశుధ్య కార్మికులు సైడ్ కాలువలను తీయడం లేదని, సైడ్ కాలువలు కనీసం నెలకు ఒక్కసారి అయిన తీయకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, సాయంత్రం అయితే దోమల బెడ ఎక్కువగా ఉందని, దాని కారణంగా ఎక్కువగా టైఫాయిడ్, డెంగీ, మలేరియా, బోదకాలు వంటి జ్వరాల బారిన ప్రజలు పడతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యానికి పంపిస్తున్న నిధులను ప్రభుత్వ అధికారులు ఏం చేస్తున్నారని, కనీసం నెలకు ఒకసారి అయినా సైడ్ కాలువలు తీసి బ్లీచింగ్ చల్లకుండా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వివరిస్తున్నారని తెలిపారు. ఇటీవల నీళ్ల పైపు వేసేందుకు పంచాయతీ ఆఫీసు రాజా వీధి నుండి గొల్లపాలెం వరకు జెసిబి సహాయంతో సిమెంట్ రోడ్డును పక్కన తవ్వడంతో మెయిన్ పైపులైన్ పగలడంతో కనీసం ఆరు రోజులు వరకు మరమ్మతులు చేయకపోవడంతో బోగోలు పంచాయతీలోని గొల్లపాలెంలో రాజా వీధిలోని ప్రజలు నీళ్ల కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చిందన్నారు. పంచాయతీ అధికారులు ఎటువంటి స్పందన లేకపోవడం నిర్లక్ష్యంగా వివరించడం తగదన్నారు.

జెవివి ఆధ్వర్యంలో పాటలపోటీలు



ప్రజాశక్తి-కావలి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం ఉదయం వక్తృత్వ పోటీలు, మధ్యాహ్నం సందేశాత్మక పాటల పోటీలను రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహనను పెంపొందించడానికి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కలిసి పని చేద్దామని, హరితవనాలు పెంచడంలో తాను ముందుంటా... అనే రెండు అంశాలు వక్తృత్వ పోటీలకు ఇచ్చినట్లు తెలిపారు. రెండు అంశాల పోటీలకు 27 స్కూల్స్ నుండి జూనియర్స్, సీనియర్స్ విభాగంలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదేవిధంగా మధ్యాహ్నం సందేశాత్మక పోటీలలో సీనియర్, జూనియర్ విభాగాలలో నుండి విద్యార్థులు 155 మంది పాల్గొన్నారు. వక్తృత్వ, పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సి.శారద, పి.ఇ.జాఫర్ ఖాన్, ఉమాశ్రీ, రామచంద్రయ్య, శ్రీకర్ల. వెంకయ్య, చంద్రశేఖర్, ఎమ్.వి.ఎస్. ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.సుబ్బరామయ్య, ఉపాధ్యక్షులు కందికట్ల.నారాయణ, కె.హరినారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి సి.శారద, షేక్.ఖాదర్‌బాషా, దామిశెట్టి బాలసురేంద్రనాధ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం



ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని పోలంగారిపల్లి గ్రామ సమీపంలోని శ్రీ ఘటిక సిద్ధేశ్వరాలయం వెళ్లే రహదారికి సుమారు రూ.30 లక్షల వ్యయంతో అతి సుందరంగా అన్ని హంగులతో శ్రీ కోమరిశెట్టి వెంకటసుబ్బారావు శుభ లక్ష్మమ్మ దంపతులతో నిర్మించిన శ్రీశ్రీశ్రీ ఘటిక సిద్ధేశ్వరాలయ ముఖద్వారాన్ని శనివారం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా భారీఎత్తున బాణసంచాలు పేల్చి పూలవర్షం కురిపిస్తూ పురోహితులు, స్థానిక నాయకులు ముఖద్వారా నిర్మాణ దాతలు ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖద్వారం మహోన్నతంగా నిర్మించారని, ఈ రహదారికి శోభ ఉట్టిపడుతుందన్నారు. భక్తిభావంతో ఇటువంటి కార్యక్రమాలు చేసే వారికి వెన్నుదన్నుగా ఉంటానని తెలిపారు. శ్రీ ఉష కామేశ్వరి ఘటిక సిద్ధేశ్వర సమేత స్వామి వారి ఆలయానికి వెళ్లేందుకు భక్తులు కూడా రహదారి తప్పకుండా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల సమస్యలను నాయకులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి మార్గాలను తెలియజేశారు. వారి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పి చైర్మన్ పొన్నుబోయిన చెంచలబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కప్పు ప్రభాకర్ రావు, మాజీ జెడ్‌పిటిసి కలివేలు జ్యోతి, ఎడమ ప్రవీణ్‌కుమార్, ముత్తంశెట్టి చెన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సంగారెడ్డి జాషువా, ఇజ్రాయల్, రఘురామయ్య, ముత్తరు వెంకటసుబ్బయ్య, ఆదయ్య, వికాస్ బాబు, ఆలూరి శ్రీనివాసులు, చంద్రయ్య, తదితరులున్నారు.

'ఉయ్యాలవాడ' వర్ధంతి



ప్రజాశక్తి-ఉదయగిరి : ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శ్రీ మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలలో శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు చాలామంది నోళ్లలో నానుతున్న పేరు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎందుకంటే తొలి స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన్ను కీర్తించారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ రఘునాథ్ రెడ్డి, డాక్టర్ సునీత, టీచింగ్ అసోసియేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమల ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కావలి



శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కావలి పట్టణం ముసునూరులోని కె.జి.బి.వి కళాశాలలో శనివారం పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సంధ్యారాణి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో వారిని ఉత్సాహ పరుస్తూ నేడు పరీక్ష సామాగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి మాట్లాడుతూ అమెరికాకు చెందిన చల్లగొళ్ల కృష్ణకుమార్, వారి సతీమణి మాధురీ సహకారంతో పేద విద్యార్థులకు విద్యాసామాగ్రి అందించామని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చాకలికొండ శారదమ్మ ఆధ్వర్యంలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇవేకాకుండా అనేక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మంజుల, హెప్సి సైమన్, ప్రవీణ, రాజేశ్వరి, వరలక్ష్మి, శ్రీ సాయి ట్రస్ట్ సభ్యులు అహిరి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



ప్రజాశక్తి-కావలి : డి.ఆర్. విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్‌లోని తమ కార్యాలయంలో 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేల విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. కావలి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ పి.పద్మావతి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యాదాత డి.ఆర్.పేరుపై పేద వృద్ధులను ఆదుకుంటున్న వారి కుమారులు విజయ్ కుమార్ రెడ్డి, విద్యాధర్ కుమార్ రెడ్డిలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేస్తూ వారిలో కూడా సామాజిక స్పృహ, సేవాభావం నింపడం బహు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్డ వినయ్‌కుమార్ రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనంనేనిరెడ్డి, సభ్యులు నెల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, జవహర్ భారతి బి.ఎస్.సి నర్సింగ్ కాలేజ్ అధ్యాపకులు భాగ్యలక్ష్మి, మౌనికగౌడ్, విద్యార్థులు పాల్గొని తమసేవలు అందించారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



ప్రజాశక్తి-దుత్తలూరు : నందిపాడు సచివాలయం పరిధిలోని కెజిబివి హాస్టల్‌లో క్షయ వ్యాధి వారోత్సవాలలో భాగంగా విద్యార్థినులకు క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌టి బిటీఈఎస్, సూపర్‌వైజర్ ఎస్‌కె ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ రెండు వారాలు పైబడి దగ్గు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత మందులు ఉచిత పరీక్షల నిక్షయ మిత్ర ద్వారా చికిత్స తీసుకుంటున్న వారికి నెలకు రూ.1000 లెక్కన చికిత్సకాలం పూర్తయే వరకు రూ.6వేలు అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అంజలి దేవి విద్యార్థినిలు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-సంగం



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు అండగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయించి ఆ దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సంగంలో శనివారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎం.పి. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో 33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7వేల 480 కోట్లను జమ చేశామన్నారు. అంతేకాకుండా గత వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులకు పెండింగ్‌లో పెట్టిన 16 వందల రూ.74 కోట్లను కూడా తాము చెల్లించామని వివరించారు. రాష్ట్రంలో ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు సమస్యలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని దొంగ ఓట్లు వేసే శిక్షణ కేంద్రంగా మార్చారని విమర్శిం చారు. ప్రస్తుతం రైతు ప్రజల ప్రయోజనాల కోసమే కార్యాలయాన్ని నిర్మించి భవనాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సంగం పిఎసిఎస్ కార్యాలయంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పలువురు రైతులు పిపిసి సెంటర్‌కు ధాన్యం తరలింపు సమయంలో పడుతున్న ఇబ్బందులు, మిల్లర్ల సమస్యలను వివరించారు. గత ప్రభుత్వంలో ట్రాన్స్‌పోర్ట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రికి విన్నవించారు. ధాన్యం ఆరబెట్టేందుకు కళ్ళాలు లేవని తెలియజేశారు. రైతుల సమస్యలను నమోదు చేసుకున్న మంత్రి రైతులు తెలిపిన ప్రతీ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలియజేశారు. ట్రాన్స్‌పోర్ట్ బకాయిలు కోటి నలభై లక్షల రూపాయలు సోమవారంలోగా రైతుల అకౌంట్‌లో జమ చేస్తామని వెల్లడించారు. మిల్లర్లు రైతులను మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కౌలురైతుల సమస్యలు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ స్వయంగా చూశారన్నారు. కౌలు రైతులను డిప్యూటీ సిఎం గతంలో ఆర్థికంగా ఆదుకున్నారన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ధాన్యానికి గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల తహశీల్దార్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు సిపిఎం నేతలతో రైతు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు బోనస్‌గా రాష్ట్ర ప్రభుత్వం రూ.500లను అదనంగా జతపరిచి రైతులకు ఇవ్వాలన్నారు. జిల్లాలో పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతుల వద్ద కనీస మద్దతు ధర కంటే రూ.300 తగ్గించి వ్యాపారస్తులు, దళారీలు కుమ్మక్కై రైతు కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. గిట్టుబాటు ధర ఇవ్వకపోగా కనీస మద్దతు ధర కూడా ఇవ్వడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వాతావరణ పరిస్థితులు రీత్యా పంట పొలాలు దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా రైతులపై చిన్నచూపుతో వ్యవహరిస్తుందన్నారు. ఏదేమైనా రైతులపై ప్రభుత్వం పెద్దమనసు చేసుకొని ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అనంతరం జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టివివి ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మూలి వెంగయ్య, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వర రావు, రైతుసంఘం నాయకులు తిక్కవరపు సుధాకర్ రెడ్డి, మారుబోయిన రాజా, ఎస్.కె.చాన్ బాషా, వెన్ను వేణు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

రీసర్వేలో పొరపాట్లను సవరించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలో రీసర్వేలో జరిగిన పొరపాట్లను సవరించాలని ఎపి రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లెలో శనివారం రైతు నాయకులు ఆందోళన చేపట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడుస్తున్నప్పటికీ చిన్నవి పెద్దవి 5, 6 గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఆ సదస్సులో రైతుల భూ సమస్యలపై ఇచ్చిన అర్జీలకు ఇంతవరకు పరిష్కరించలేక పోవడంలో అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు రీసర్వేలో జరిగిన పొరపాట్లను సవరించి భూమిపై ఉన్న రైతుల భూములను పరిశీలించి 1బి అడంగల్ ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ అనే కార్యక్రమంపై రైతులను రిజిస్ట్రేషన్ చేసుకోమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన రైతుల పేర్లపై ప్రస్తుతం 1-బి, అడంగల్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు 100 శాతానికి పూర్తి కావాల్సి ఉండగా కనీసం 30శాతం కూడా పూర్తికాకుండా రైతులు వెనుతిరిగి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే 1-బి, అడంగల్‌లను అర్హులైన రైతులకు ఇచ్చి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా భూమిపై హక్కు ఉండేలా కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలని వేడుకోలు



బస్సు కోసం ఎండలోనే ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : అనుముసముద్రం గ్రామ పంచాయతీకి సంబంధించిన మజారా గ్రామమైన తెల్లపాడు ఎస్‌సి కాలనీ వాసులకు, బస్‌షెల్టర్ నిర్మించాలని వేడుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో నిర్మించి ఉన్న బస్సు షెల్టరు శిథిలావస్థకు చేరడంతో, దానిని ఇటీవల కూల్చి వేసినట్లు, అక్కడ ముఖ్యంగా దళితవర్గానికి చెందిన వారిగా నివసిస్తున్నామని, తమ పిల్లలు, హైస్కూల్‌కు వెళ్లేటప్పుడు ఎర్రటి ఎండలో బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అదేవిధంగా వృద్ధులు ఇతర పనులు నిమిత్తం, అక్కడ నిలబడడానికి కూడా కాసంత నీడ లేకుండా ఉండడం వల్ల ఏ పరిస్థితుల్లో ఏమి జరుగుతుందోనని బెంగగా ఉందని, కావున ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, నాయకులు గుర్తించి త్వరగా విశ్రాంతి గృహాన్ని మంజూరు చేయాలని మొర పెట్టుకుంటున్నామన్నారు.

రైతులకు అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలోని తాళ్లూరులో శనివారం జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు మాలతీదేవి ఆధ్వర్యంలో తాళ్లూరులో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు మాలతీదేవి రైతులతో మాట్లాడుతూ నూనె గింజల ఉత్పత్తిలో వేరుశనగ విత్తన ఎంపిక, విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు అనుసరించి ఎరువుల వాడకం జిప్సం తగిన మోతాదులో ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో నెల్లూరు వ్యవసాయ శాస్త్రవేత్త ఓబయ్య, శాస్త్రవేత్త ప్రసన్న రాజేష్, మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అప్కాస్ రద్దును విరమించుకోవాలి

ప్రజాశక్తి-కావలి



నిరసన చేపడుతున్న సిఐటియు నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్ రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం పట్టణంలోని ఒకటి, నాలుగవ డివిజన్ మస్టర్ పాయింట్ల వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు కార్మికులను అప్పజెప్పాలని చూస్తుందన్నారు. ఈ విధానాన్ని సిఐటియు వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కార్మికులకు, ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గెలిస్తే కార్మికులను పర్మినెంట్ చేస్తాడని కార్మికులు భావించి ఓట్లు వేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పర్మినెంట్ చేయకపోగా ఉన్న అప్కాస్‌ను రద్దు చేస్తున్నామని చెప్పడంతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. అభద్రతకు లోనవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ దశల వారీ పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, యూనియన్ నాయకులు తురక సీనయ్య, కె.బాబు, బిరదల మహేష్, ఒంగోలు రమేష్, ఎం.పోలయ్య, పరుసు చిన్నమ్మ, లేటు రాజ్యలక్ష్మి, జ్యోతి, కార్మికులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు

గృహనిర్మాణ ప్రగతి అధికారుల సమీక్షలో ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి

కావలి నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి పేదవాడిని గుర్తించి వారికి ఇల్లును మంజూరు చేయాలని కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం సమావేశ మందిరంలో ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణతో కలిసి గృహ నిర్మాణ ప్రగతిపై అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సొంతిల్లు కట్టించి ఇవ్వాలని సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహ నిర్మాణ ప్రగతి పథకాన్ని ప్రవేశ పెట్టామన్నారు. గత ప్రభుత్వంలో జగనన్నకాలనీ పేరుతో వైసిపి నాయకులు ఎన్నో అవినీతి అరాచకాలకు పాల్పడి, అర్హత ఉన్న నిజమైన పేదవాడికి సొంతిల్లు లేకుండా మోసం చేశారన్నారు. మన ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడిని గుర్తించి కుల, మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇల్లును మంజూరు చేయాలని ఆయన కోరారు. అధికారులు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఉద్యోగి కూడా పేదవాళ్లను ప్రేమించి పేదలకు కావాల్సిన అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. మనందరం కలిసి కావలి ప్రజలను కాపు కాసుకుందామన్నారు. ఈ ఐదేళ్లలో తాను ఎలా పరిపాలించానో తన క్యారెక్టర్ ఏమిటో రాబోయే ఎన్నికల్లో రెండోసారి తనను గెలిపించినప్పుడే అర్థం అవుతుందన్నారు. కావలిలో అవినీతి రహిత పరిపాలనను అందించడమే తన లక్ష్యమన్నారు. నివాసస్థలానికి, ఇల్లు నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ స్థలం, ఇల్లు వచ్చేలా అధికారులు తమ నాయకుల సహకారంతో పేదవాడికి మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, డి.ఎల్.డి.ఒ విజయ్ కుమార్, హౌసింగ్ ఇఇ ఎస్.మాధవరావు, కావలి టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, కావలి రూరల్ మండలం అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, కావలి నియోజకవర్గం అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అందే రామయ్య నియామకం

ప్రజాశక్తి-దుత్తలూరు



ఎపి కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఉదయగిరి నియోజకవర్గం అధ్యక్షుడిగా దుత్తలూరు మండలం బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన అందే రామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో విశ్వ భారతి స్వచ్ఛంద సేవాసంస్థలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న రామయ్య ని నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో సంస్థ ఎదుగుదలకు ఎంతో కృషి చేస్తానని తనను నియోజకవర్గ అధ్యక్షుడిగా తీసుకున్న ఎపి కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కూడారి.తిరుపాలు, కార్యదర్శి ఉదయ్‌కుమార్‌కు సౌత్‌జోన్ అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, ఉదయగిరి నియోజకవర్గం కన్వీనర్ కదిరి వెంకట రంగారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైసిపి ఎస్‌సిసెల్ అధ్యక్షుడిగా కళ్యాణ్

ప్రజాశక్తి-బిట్రగుంట



కావలి నియోజకవర్గం ఎస్‌సిసెల్ అధ్యక్షుడిగా బోగోలు పంచాయతీ అరవ పాలెంకు చెందిన ఆంథ్రోస్ కళ్యాణ్ నియమించినట్లు కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి బోగోలు మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, మండల నేతలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు బోగోలు వైసిపి కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఎకె సుందర్‌రాజ్, మేకల శ్రీను, తోటపల్లి సాగర్, సాల్మన్ రాజ్, రాయి వినోద్ యాదవ్, శేఖర్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న చేపపిల్లలు విడుదల

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల ప్రాజెక్ట్‌లో ఫిబ్రవరి 25న సోమశిల జలాశయంలో చేప పిల్లలు విడుదల చేయనున్నట్లు మత్స్యశాఖ సంచాలకులు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ చేప పిల్లల విడుదలకు చేయడానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి, మత్స్యశాఖ జిల్లా జెడి, చేతుల మీదుగా 10లక్షల చేప పిల్లలు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు రానున్నట్లు ఆయన తెలిపారు.

చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-ఉదయగిరి



మండలంలో ప్రతి శని, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చెత్త సేకరణ చేసినట్లు ఇఒపిఆర్‌డి షేక్.కరిమల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం శకునాలపల్లి పంచాయతీలు క్లాప్ మిత్రల ద్వారా ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించడం జరిగిందన్నారు. ఈ చెత్త సేకరణతో వర్మీ కంపోస్ట్ తయారు చేయొచ్చని అందుకు తగ్గట్టు ప్రతి పంచాయతీలో వర్మీ కాంపౌండ్ షెడ్‌లను నిర్మించి ఎరువులు తయారీ సేకరణ జరుగుతుందన్నారు. కావున ప్రజలు సిబ్బందికి సహకరించి తడి, పొడి చెత్తలను వేరుచేసి వారికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు బాబు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ కలిసి ఘన సన్మానం చేశారు. ఈ శనివారం నెల్లూరులోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారి పాత పరిచయాలను గుర్తు చేసుకున్న ముఖ్యమైన రాజకీయ జ్ఞాపకాలను ఇరువురు చర్చించుకున్నారు. కార్యక్రమంలో మధు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రజానీకానికి నష్టదాయకం

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో ప్రజా ఉపయోగకర కేటాయింపులు లేవని, దేశ సంపదను, వనరులను, ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా కేటాయింపులు ఉన్నాయని, ఇది ప్రజలకు నష్టదాయకమైన చర్య అని పేర్కొంటూ వామపక్షాల ఆధ్వర్యంలో నగరంలో నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి విశేష స్పందన కనిపించింది. ఇటీవల ప్రవేశపెట్టి బడ్జెట్‌లో రైతాంగానికి, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికులకు నిధులు కేటాయింపులో కోత విధించడం దారుణమన్నారు. ఇప్పటికే గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కార్మికులకు వేతన బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించే ఆలోచన చేయకుండా కోత విధించడం సరికాదంటూ ప్రభుత్వంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో టిడిపి, జనసేన నాయకులు ఆప్కాస్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు తియ్యటి మాటలు చెప్పిందని, అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు అప్పగించే విధంగా మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం దారుణమంటూ మున్సిపల్ కార్మికులు నగరంలో దశల వారీ నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైన చర్య కాదని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఖండిస్తూ కార్మికుల నిరసన కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. మోడీ డైరెక్షన్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కలిసి ఆప్కాస్ ఉద్యోగులకు అన్యాయం చేయడం తగదని, పట్టణ సంస్కరణల పేరుతో కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కాలరాస్తున్నారన్నారని కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రభుత్వఆధీనంలో నడిచే ఆప్కాస్‌ను రద్దు చేయాలని నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని వాపోతున్నారు. భారత ప్రధాని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కలలు కంటున్న వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా వివిధ పథకాల అమలుకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని జెడ్‌పి సమావేశం హాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను కలెక్టర్ ఆనంద్‌తో కలిసి సమీక్షించారు. దేశాన్ని విశ్వగురుగా తీర్చిదిద్దే క్రమంలో అమలు చేయాల్సిన విధానాలు, వాటి ద్వారా భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో రైతు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు బోనస్‌గా రూ.500 రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని రైతు, కౌలురైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు సంయుక్తంగా ఛలో నెల్లూరు కార్యక్రమం నిర్వహించారు. రైతులు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఎబిఎం కాంపౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. తొలుత ఇందుకూరు పేట మండలానికి చెందిన రైతులు పాదయాత్రగా ఎబిఎం కాంపౌండ్‌కు చేరుకోని ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 7లక్షల ఎకరాలల్లో రైతులు వరిపంట సాగుబడి చేశారన్నారు. దాదాపుగా 20లక్షల పుట్ల ధాన్యం ఉత్పత్తి అయిందనిరైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. గత ఏడాది పుట్టి ధాన్యం రూ.26వేల నుంచి రూ.25వేలు వరకు మద్దతు ధరగా నిర్ణయించి ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఈ ఏడాది మాత్రం రూ.18వేలకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వమే మద్దతు ధర తక్కువగా ప్రకటిస్తే, ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఇంకా ధర తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. అనంతరం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.


మార్చిలో కొత్త రేషన్‌కార్డులు. మంజూరు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

రాష్ట్రవ్యాప్తంగా మార్చి నుంచి కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెం పట్టణ సమీపంలోని జొండాదిబ్బ వద్దనున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (స్టాక్ పాయింట్)ను మంత్రి తనిఖీ నిర్వహించి రైసుమిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జొండాదిబ్బ వద్ద స్టాయిపాయింట్‌ను తనిఖీ చేసి స్టాకు వివరాలు, సరఫరా మొదలైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం మహిళలందరూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక టెక్నాలజీతో క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్‌కార్డులను అందించి రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించేందుకు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు తెలిపారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దీపం-2 పథకం హామీని సిఎం చంద్రబాబు నెరవేర్చారని, ఇందులో భాగంగా ఈ జిల్లాలో 4లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 93.42లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఈ ఏడాది 1.50 కోట్లు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మహిళలందరూ తెలుసుకోవాలని, అందులో భాగస్వామ్యం కావాలన్నారు. మే నుంచి అన్ని సంక్షేమ వసతి గృహాలలో, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామన్నారు. కోవూరు ప్రభుత్వ నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అహర్నిశలు శ్రమిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు . ప్రజలందరూ కూడా మంచి పరిపాలన అందిస్తున్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ స్టాక్ పాయింట్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారని, ఇలాంటి చిత్తశుద్ధి గల ఆయన సివిల్ సప్లయిస్ మంత్రిగా ఉండడం మనందరి అదృష్టమని తెలియజేశారు. జిల్లాలోని స్టాక్ పాయింట్ల అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తమై ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రజలకు తుకాల్లో తేడాలు లేకుండా నాణ్యమైన సరుకులు అందించాలని సూచించారు. అన్ని వస్తువులు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండేలా చూసుకోవాలన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్‌డిఒ పావని, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డిసిఒ గుర్రప్ప, చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్లు

మంత్రిని కలిసిన రేషన్ డీలర్స్

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్ర సివిల్ సప్లయిస్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శనివారం నెల్లూరులో రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు శాలువా కప్పి పుష్ప గుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లకు సంబంధించిన సమస్యలను తయారు చేసి వినతిపత్రంలో మంత్రికి అందజేశారు. ఈ సమస్యల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారని రేషన్ డీలర్స్ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు.

కంటి అద్దాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఇటీవల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ప్రస్తుతం అందజేసిన కంటి అద్దాలను వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు రాధారాణి తెలిపారు. కోవూరు మండలం, ఇనమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుని శరీరంలో నేత్రాలు అత్యంత ప్రధానమని వీటి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-కోవూరు

పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు విద్యను బోధించే విషయంలో పలు వినూత్న మార్పులకు సంబంధిత అంగన్వాడీ కార్యకర్తలు శ్రీకారం చుట్టినప్పుడే వారు వీటి పట్ల ఆకర్షితులు అవుతారని మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం, ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తే వారు చక్కగా ఆకర్షి తులు అవుతారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అంగన్వాడీ కార్యకర్తలు అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, డిఆర్‌పి వెంకటరామిరెడ్డిలు పలు సూచనలు చేశారు.



మాతృభాషతోనే వికసితభారత్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మాతృభాషతోనే వికసిత భారత్ సాధ్యమని ప్రధానోపాధ్యాయురాలు ఎం. సుజాత అన్నారు. పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మాతృభాషలో విద్యను అభ్యసించడం వలన నేర్చుకునే సామర్థ్యం, వేగం విద్యార్థు లలో పెరుగుతాయన్నారు. విద్యార్థులలో సజనాత్మక వికసించడానికి, ఆత్మవిశ్వాసంతో జీవించడానికి మాతృభాషతోనే సాధ్యమన్నారు.

మాతృభాషలో చక్కగా చదవడం,రాయటం ద్వారా ఎన్ని భాషలు అయినా నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి తోడ్పడుతుందన్నారు. అమ్మ ఒడి,తొలి బడి మాతృభాషకు పునాది అని తెలిపారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం మూడు దశాబ్దాలుగా మాతృభాష పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేస్తున్న సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, రమణమ్మ, నిరంజన్ లక్ష్మీ, కనకదుర్గ విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలతో అవస్థలు

ప్రజాశక్తి-నెల్లూరు

పట్టణంలోని పలుచోట్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా ఫలితం శూన్యం. పట్టణంలోని శెట్టిగుంటరోడ్డు, నవాబుపేట, తదితర ప్రాంతాల్లో దోమలు విపరీతంగా ఉన్నాయి. వీటి బారి నుంచి రక్షించాలని సంబంధిత అధికారులను ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

శ్మశాన సమస్యను పరిష్కరించండి సారూ..



నినాదాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

శ్మశాన విషయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని గిరిజనులు సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వివరాల్లోకి వెళితే...తోటపల్లి గూడూరు మండలం, కోడూరు పంచాయతీ కోనేటితిప్పు గిరిజన కాలనీ వాసులు శ్మశానం కోసం తమకు కేటాయించిన 0.50 సెంట్లు భూమికి హక్కులు కల్పించాలని కోరారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం భూమి కొనుగోలు (ఎల్.పి.ఎస్) పథకం కింద పన్నూరు కృష్ణారెడ్డి నుంచి ఎకరా భూమిని కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి కృష్ణారెడ్డికి పరిహారం అందకపోవడంతో ప్రస్తుతం ఆ భూమిని ఇతరులు ఉపయోగించుకున్నారని తెలిపారు. శ్మశాన భూమికి సంబంధించిన పత్రాలు తమ వద్ద లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల కోరిక మేరకు స్థానిక నేతలు 50 సెంట్ల భూమిని రొయ్యల రమణయ్య అనే రైతు వద్ద కొనుగోలు చేసి శ్మశానం స్థలం కేటాయించడం జరిగిందన్నారు. దీనికి సంబంధించిన అగ్రిమెంట్ చెన్నపల్లి పాలెం గ్రామానికి చెందిన మారం రెడ్డి చిన్న బుజ్జి రెడ్డి వద్ద ఉన్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు శ్మశానానికి కేటాయించిన భూమిపై తమకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. తహశీల్దారుకు విజ్ఞప్తి చేశారు. శ్మశానం భూమి స్థల అగ్రిమెంట్ చేసుకున్న మారం రెడ్డి చిన్న బుజ్జి రెడ్డిని వివరణ కోరగా శ్మశానం భూమి కోనేటి తోపు గిరిజనులకు అప్పచెప్పామని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సూచించిన మేరకు వారికి పక్కాగా హక్కులు కల్పిస్తామని తెలిపారు.కోనేటి తోపు శ్మశాన స్థలానికి హక్కులు కల్పించి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు.

సెకీ ఒప్పందంపై ఎపిఇఆర్‌సి నివేదిక సక్రమమే

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రప్రభుత్వరంగ సంస్థ సెకీతో వైసిపి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు సక్రమమేనని ఎపిఇఆర్‌సి స్పష్టం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని వైసిపి అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఒప్పందాలపై చంద్రబాబుకు వంతపాడే ఎల్లో మీడియాలు దీనిపై గతంలో తాము రాసిన తప్పుడు వార్తలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాల కోసం ముందుచూపుతో సెకీతో ఆనాడు వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రానికి తక్కువ రేట్లకే విద్యుత్ లభించిందన్నారు. సెకీ నుంచి 4 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుపై డిస్కంలకు ఏపీఈఆర్సీ అనుమతించింది. గతంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం పారదర్శకంగా జరిగిందని దీనితో మరోసారి స్పష్టమైందన్నారు. రాష్ట్ర ప్రజలు, రైతుల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆనాడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ సెకీ (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో చేసుకున్న ఒప్పందాలన్నీ సరైనవేనని, కొనుగోలు ఒప్పందం అత్యంత పారదర్శకంగా జరిగిందని ఏపీఈఆర్సీ స్పష్టం చేసిందన్నారు. ఈ ఒప్పందం వెనుక అవినీతి జరిగిందంటూ అడ్డూఅదుపూ లేకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన చంద్రబాబు, ఎల్లో మీడియాకు ఇప్పుడు దీనిపై ఏం చెబుతారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం అని తెలిసినా, దళారులు లేరని తెలిసినా.. వైఎస్ జగన్ లంచాలను తీసుకున్నారని, అమెరికాలో కేసు నమోదైందని, ఏపీలోనూ కేసు పెడతామని ఆరోజు తెలుగుదేశం పార్టీ నేతలు రెచ్చిపోయారు. దీనిపై పూర్తి వివరాలతో మా నాయకుడు వైఎస్ జగన్ వెంటనే స్పష్టత ఇచ్చారు. ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా యూనిట్ రూ. 2.49 లతో ఒప్పందం చేసుకుంటే, ఎక్కడ తమ నాయకుడికి మంచి పేరొస్తుందనే భయంతో బురదజల్లే కార్యక్ మానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వలన వారికి ఏడాదికి రూ. 40 వేలు సాయం చేసినట్లవు తుంది. జగన్ తీసుకున్న ఈ ఒప్పందం అమలు కాకపోయుంటే రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల పంపుసెట్లు వాడుతున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు. వాస్తవాలను ప్రజలకు చూపించే దమ్ము ధైర్యం ఎల్లో మీడియాకు ఉందా అని సవాల్ విసురుతున్నా. 2014లో చంద్రబాబు అధికారంలోకి రాకముందు రూ.29 వేల కోట్ల విద్యుత్ బకాయిలు ఉంటే, ఆయన దిగిపోయేనాటికి రూ. 86 వేల కోట్లకు పెంచారని విమర్శించారు. ఇలాంటి వాస్తవాలు ఎల్లో మీడియాకి రాసే దమ్ముందా? కనీసం మేం చెప్పేది వాస్తవం కాదని చెప్పగలరా? కూటమి పాలన చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు.